# మనమాట మనపలుకు అందులోని కులుకు

తెలుగు దినపత్రికల దయవలన కొత్త ప్రయోగాలు కొత్త మాటలు నిత్య వాడుకలోకి వచ్చాయి. ఈ పత్రికల భాషను సామాన్య జీవితంలో ముఖ్యంగా ఇంట్లోజరిగే సంఘటనలకు తగిలించి చెబితే చాలా తమాషాగా వుంటుంది. గొప్ప గొప్ప నాయకులు ప్రభుత్వ అధికారులు మాట్లాడరు. అభిభాషిస్తారు, ఉద్ఘాటిస్తారు, ప్రకటిస్తారు, వ్యాఖ్యానిస్తారు, వెల్లడిస్తారు. చెప్పాడు, విన్నాడు, అన్నాడు అనేవి మామూలు మనుష్యులకు వర్తించే పదాలు. పెద్దలు సమావేశాలు, గోష్ఠులు జరుపుతారు. మామూలు మనుషులు కలుసుకున్నాం మాట్లాడాం అంటారు. సమావేశాల్లోనూ, సభల్లో, గోష్ఠుల్లోను పెద్దలు అంగీకారాలు, ఒడంబడికలు, ప్రకటనలు, వ్యాఖ్యలు చేస్తారు – ఇంకా అభిభాషిస్తారు మామూలు మనిషి చస్తే, గుట్టుగాదినవారాలు జరుగుతాయి. గొప్పవారు మృతి చెందినపుడు సంతాప సభలు, ప్రకటనలు, తీర్మానాలు వెలువడ్డమే గాకుండా సంతాప దినాలు ప్రకటిస్తారు. మామూలు మనుషులు చనిపోతే పతాకాలు అవనతంకావు. ఇంటి ముందు ముగ్గెట్టరు, జ్ఞాతులు మయిలపడతారు, చుట్టాలు, బ్రాహ్మలు వచ్చి తినిపోతారు.

ప్రతి సందర్భంలోనూ పత్రికలవారిని పిలవటం ఒక సంప్రదాయం ఈ రోజుల్లో (బాజాలవాళ్ళనూ, పల్లకి బోయీలను కావళ్ళ వాళ్ళనూ బళ్ళ వాళ్ళను రిక్షా వాళ్ళను పిలిచినట్టు). వారి ముందు వాగటాన్ని "ఉద్ఘోషించటం" అంటారు. విమానాలు బాంబులేవేయగ ఎక్కువ మంది చచ్చారు అని చెప్పుకుంటారు. రాసినప్పుడు "ఉధృతంగా విమానదాడులు, అసంఖ్యాకంగా పౌరులు మృతి" అనిరాస్తారు. మామూలు జనాభా ఉద్యోగాల్లో, వృత్తుల్లో చేరుతారు. (జాయినయాం అంటారు.) మంత్రులు, గవర్నర్లు, పెద్ద పెద్ద జడ్జీలు "ప్రమాణ స్వీకారం" చేస్తారు. గొప్పవారి గవర్నర్లు, పెద్ద పెద్ద జడ్జీలు "ప్రమాణ స్వీకారం" చేస్తారు. గొప్పవారి శరీరాలు చావగానే "భౌతికకాయా" లవుతాయి. మామూలు వారిని శవాలవుతాయి. పెద్దవారు, గొప్పవారు "ఆదేశాలిస్తారు", సాధారణులు చెయ్యమని చెబుతారు. మామూలువాళ్ళు డబ్బు తెచ్చాం, పోగుచేశాం,ఆదాచేశాం అంటారు. హైక్లాసువాళ్లు "నిధులు సమకూరుస్తారు" వారు "సంకల్పిస్తారు" మనం "అనుకున్నాం" అంటాం. మనుషులంతా ఒకటికారని మనుషుల మధ్య తేడాలున్నాయనీ వాడే భాషను చూస్తే తెలుస్తుంది. "సమస్య –పరిష్కారం" అనే మాటలు చిల్లర మనుషులకు చిల్లర సంగతులకు వాడరు. "సమస్య"లను పెద్దవాళ్ళు సృష్టిస్తారు. "పరిష్కారాల" కోసం కూడా వారే ప్రయత్నిస్తారు. ఒక అమ్మాయిని దుర్మార్గులో రవుడీలో ఏదో చేశారనుకోండి– "ఒక అబలపై అత్యాచారం" అంటారు కాని మరోలా అనరు. అంటే విషయమేదైనా చెప్పడంలో ఒక ఫాయా ఒక దర్జా, ఒక స్టైయిలూ వుంటుంది. ఏదో తిని చచ్చారనుకోండి "విషాహారం తినగా దుర్మరణం" అని రాస్తారు. ఇలా ఎన్నయినా ఉదాహరణలు

యిచ్చుగుంటూ పోవచ్చు. ఇంతకీ ఈ పరిభాష గురించిన ముచ్చట ఎందుకు వచ్చిందంటే – సామాన్య జీవితంలో రోజువారీ సంఘటనలను ఈ పరిభాషలో చెబితే హాస్యంగా, చమత్కారంగా వుంటుంది.

"పెళ్ళి కూతురితో ప్రెస్ కాన్ఫరెన్స్" అనే హెడ్డింగు ఉందనుకోండి – చూడగానే నవ్వుకుంటాం. పెళ్ళికూతురి కేమిటి ప్రెస్ కాన్ఫరెన్సేమిటి అని. "ఊరగాయల వాడకంపై అత్తగారి – అభిభాషణ" "పనిమనిషి నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ అమ్మ అభిశంసన" – "పిల్లల చిరుతిళ్ళపై పరిమితి విధింపు" "సుందరమ్మతో భేటీ" – "అత్తాకోడళ్ళ మధ్య పరస్పరావగాహనకు ప్రత్యేక చర్చలు–"

"సీతమ్మగారింట్లో పొయ్యి వేయటానికి అమ్మమ్మ తోడ్పాటు" యిలా హెడ్డింగులు రాసి కింద స్టోరీలు రాస్తే గొప్ప తమాషాగా ఉంటుంది.

సామాన్యులు ప్రయాణాలు చేస్తారు, గొప్పవారు పర్యటనలు చేస్తారు. "అత్త పుట్టింటికి వెళ్లింది" – "వదిన పుట్టింటి నుంచి తిరిగొచ్చింది" అని అంటాం. వాళ్ళు "అత్త ఏలూరు పర్యటన" అన్నా "వదిన గుంటూరుకు పునరాగమనం" అన్నా నవ్వు వస్తుంది. మనం సాగనంపుతాం, వారు వీడ్కోలు చెబుతారు. మనం భోజనానికి రండి అంటాం – వారు విందుకు ఆహ్వానిస్తారు. మనం బాగుపడటానికి ప్రయత్నాలు చేస్తాం – వారు అభివృద్ధికి పథకాలు వేస్తారు. మనం అడ్డు వస్తున్నారనే వారిని వాళ్ళు "అభివృద్ధి నిరోధక శక్తులు" అని దయ్యాల్ని వర్ణించినట్లు వర్ణిస్తారు. మనం "నీటి తగూలు" అంటే "జలాల వివాదం" అని వారంటారు. కలవారి భాష, కాని వారి భాష అని స్థిరంగా ఏర్పడిపోయింది. లేకపోతే గొప్పవారి భాషను సామాన్యులకు అన్వయించినపుడు నవ్వనేల – "అయిష్టం" అనటానికి "సావిత్రి పట్ల అత్తగారి ప్రాతికూల్యం"అంటారు. ఈ భాష నెమ్మది నెమ్మదిగా కథలూ నవలల్లోకి కూడా దిగుతోంది. ఇది వ్యావహారికమే గాని ఇదొక కృత్రిమమైన భాష–యిది యిలా అవటానికి కారణం మనం ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో రాయటమే. తరువాత ఇంగ్లీషు శబ్దాలకు సమానార్థకాలను సృష్టించడంచేత ఆ మాటలను నిత్య జీవితానికి అన్వయించినపుడు నవ్వురాక మానదు.

మన నిజమైన తెలుగు మన అట్టడుగు వర్గ ప్రజల దగ్గర యింకా మిగిలివుంది. మన అమ్మమ్మలు, అత్తలు, వదినలు, బామ్మలు వీరంతా ప్రాణంలేచి వచ్చే హాయైన తెలుగు మాట్లాడుతారు. చాలా విచారకరమైన సంగతి ఏవంటే పుస్తకాలు రాసేవాళ్ళు చాలామంది దగ్గర ఆడ మగా అన్న తేడా లేకుండా ఒరిజనల్ ఒకటోరకం తెలుగు లేదు. (మనం సన్స్ ఆఫ్‌ది సాయిల్ కాకుండా సనిన్లాస్ ఆఫ్ ది సాయిల్ అవుతున్నాం) అనగా తెలుగు బిడ్డ కావటానికి బదులు తెలుగు పీడగా తయారవుతున్నాం.

జనం భాష జనం ఆలోచనలు జన జీవితాన్నుంచి పారిపోవటమే, దూరం కావటమే, చదువుకోవటం అభివృద్ధి చెందటం అంటే – భాష అభివృద్ధి చేసుకోండి అని ఎవరికేనా

చెప్పండి - నవ్వొస్తుంది. జీవితంలోంచి పుట్టే భాషని తిరస్కరించి పుస్తకాల్లోంచి వచ్చే భాషను వల్లిస్తే అందులో పవరేం వుంటుంది?

మనం మాట్లాడుకునే భాష పట్టుతేనెలా వుంటుంది. వాళ్ళు సృష్టించినది దూదికుక్కిన సరస్వతీదేవి బ్రాసరీల్లా వుంటాయి.

# ఇంకా తెలవారదేమీ?

పాతికేళ్ళ క్రితం నేనెవర్ని? ఇప్పుడు నేనెవర్ని? పాతికేళ్ళ క్రితం నేను ఎలా వున్నానని వూహించు కోవటం ప్రారంభిస్తే నాకు తెలిసిన ఎవరో అమ్మాయి గురించి చెప్పుకోటానికి ప్రయత్నిస్తున్నట్లు వుంటుంది. లేత చామనచాయ మొహం, చిన్న కళ్ళు, పిలకల్లాటి జడ, కొంచెం బొద్దుగా గౌనులు వేసుకోటం మాని పరికిణీలు, జుబ్బాలు వేసుకునే తొమ్మిదేళ్ళ అమ్మాయి గుర్తుకొస్తుంది. మెళ్ళో నల్లపూసలతాడు మంగళ సూత్రాలు ఎగురుతున్నా లెక్కచేయకుండా వీథుల్లోనో, దొడ్లోనో, తోటల్లోనో, తొక్కుడుబిళ్ళ, ఒప్పులకుప్ప వయ్యారిభామా, చెమ్మ చెక్కలు, బొమ్మలాటలు, బొమ్మల పెళ్ళిళ్ళు ఆడుకునే అమ్మాయి లీలగా ఎవరో తెలిసిన మొహంలా జ్ఞాపకాని కొస్తుంది. అరుగులమీద చేరి గచ్చకాయలు, వామనగుంటలు, చింతపిక్కలు ఆడుకునే రోజులవి. మాగాయి టెంక చీకుతోనో, మామిడికాయ ముక్కలు ఉప్పూ కారం వేసి అద్దుకు తింటూనో చెలికత్తెలతో చేరి ఆడుకుంటూ పాడుకుంటూనో గడిపేసిన బాల్యం అది. నా చదువుమీద మావాళ్ళు అట్టే ఖాతిరీ చూపలేదు. ఆ పని యీ పనిచేసే కర్మయోగమే కాని జ్ఞానయోగం పట్టలేదు. పల్లె టూళ్ళలో ఆడపిల్లను చదువుకు బడికి పంపడం అంటే - చెడ గొట్టడం కిందే లెక్క. మగపిల్లలే అంతంత మాత్రంగా చదువుకునేవారు, పనీ పాటా నేర్పి అత్తెసరు పొయ్యి కెక్కించటం. పొయ్యి వెలిగించటం. గిన్నెలు చెంబులూ తళతళలాడేలా తోమటం. పీకి పిండెట్టి పెద్దవాళ్ళను చీరలూ నగలూ కొనిపించు కొనటం వరకే ఆడదాని జీవిత లక్ష్యం - ఆ తరువాత పిల్లల్ని పెట్టడం వాళ్ళతో కుటుంబాన్ని యీడ్చుకురావటం వరకే ఫిమేల్సు రోలు. చదువుకోకపోయినా మా ఇళ్ళలో అక్కడా అక్కడా రాణీ రుద్రమదేవులూ, నాయకురాళ్ళూ, మొసగత్తెలూ వుండేవారు. మెజారిటీ ఆడసరుకు పొయ్యిలోంచి పడకగదిలోకీ ఆ పైన పురిటిగదిలోకి వెళ్ళే వాళ్ళే!

బొగ్గులతో కుంపటిమీద వంట చేసేవాళ్ళని గురించి మితిమీరి పోతున్నారని షోకు లెక్కువని ఈడ్చి తన్నేవాళ్ళు లేక యిలాంటి బుద్దులనీ ఆడిపోసుగునేవారు. ఆ రోజునుంచి ఈ రోజువరకూ బోయినా లయాక అరుగులమీదచేరి ఆడాళ్ళు రోజువారీ వార్తా విశేషాలు చాడీలు కష్టసుఖాలు వింతలూ అన్నీ చెప్పుగుని మళ్ళీ సాయంత్రం తిళ్ళకు మధ్యాహ్నంనుంచీ యత్నాలు సాగించేవారు.